لا إله إلا الله محمد رسول الله

1

# లా ఇలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదుర్ రసూలుల్లాహ్


కూర్పు :

**అబ్దుష్షకూర్ ఉమరీ**

(అధ్యాపకులు, మర్కజ్ దారుల్‌బిర్, పెడన)



ప్రకాశకులు :

**మర్కజ్ దారుల్‌బిర్**

అహ్మద్ నగర్, పెడన, ఆంధ్రప్రదేశ్, ఇండియా

ఫోన్ : 08672 200003, 9912193013.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

# "లా ఇలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదుర్ రసూలుల్లాహ్"

ఇస్లాం పరిధిలో ఒక వ్యక్తి **"లా ఇలాహ ఇల్లల్లాహ్, ముహమ్మదుర్ రసూలుల్లాహ్"** పవిత్ర వచనాన్ని పఠించి ప్రవేశిస్తాడు. ఈ వచనంలో కేవలం రెండు వాక్యాలు మాత్రమే ఉన్నాయి.

1. లా ఇలాహ ఇల్లల్లాహ్ (తౌహీద్–దేవుని ఏకత్వపు వచనము)
2. ముహమ్మదుర్ రసూలుల్లాహ్ (రిసాలత్–దైవ దౌత్య వచనం)

## "లా ఇలాహ ఇల్లల్లాహ్" అంటే..?

అల్లాహ్ తప్ప ఇతరులెవరూ ఆరాధ్య దైవాలు కారు. ఆయనకు తప్ప ఇతరులకు దైవత్వం లేదు. ఆయన ఆరాధనలలో మరెవరికీ భాగస్వామ్యం లేదు. ఆయనే సృష్టికర్త, యజమాని, పాలకుడు, పోషకుడు. ఆయన అధికారాల్లో, ఔన్నత్యంలో, గుణగణాల్లో, ఆరాధనల్లో వేరెవ్వరికి భాగస్వామ్యం లేదని మనస్ఫూర్తిగా భావించి సాక్ష్యమివ్వడం. దీనినే **"తౌహీద్"** అంటారు. "తౌహీద్"కు మూడు కోణాలున్నాయి, అవి :

**1. తౌహీదె రుబూబియత్ 2. తౌహీదె ఉలూహియత్ 3. తౌహీదె అస్మా వ సిఫాత్.**

## 1. తౌహీదె రుబూబియత్

సమస్త సృష్టిని సృష్టించినవాడు కేవలం అల్లాహ్ ఒక్కడేనని విశ్వసించడం. ఆయన ఏది చేయాలనుకున్నా కేవలం **"అయిపో"** అని ఆజ్ఞాపిస్తే చాలు.. అది అయిపోతుంది. ఆయన ఆజ్ఞ లేనిదే చెట్టు నుండి ఆకు కూడా రాలదు. ఆయనే సృష్టికి యజమాని, పాలకుడు నడిపించువాడు, ఆయనే మానవునికి జీవన్మరణాలను ప్రసాదిస్తాడు.

"ఓ ప్రవక్తా!... మీరు వారిని ప్రశ్నించండి : ఆకాశం నుండి, భూమి నుండి మీకు ఉపాధినిచ్చేవాడు ఎవడు? వినే శక్తి, చూసే శక్తి ఎవరి అధీనంలో ఉంది? నిర్జీవుల నుండి సజీవులను, సజీవుల నుండి నిర్జీవులను వెలికి తీసేవాడు ఎవడు? ఈ విశ్వ వ్యవస్థను నడుపుతున్న వాడు ఎవడు? వారు తప్ప కుండా "అల్లాహ్" అని సమాధానం ఇస్తారు. అప్పుడతను: అలాంటప్పుడు

మీరు దైవభీతి కలిగి ఉండరా?" *(యూనుస్ : 31)*

"తౌహీదె రుబూబియత్" కు వ్యతిరేకం "షిర్క్ ఫిర్- రుబూబియత్". అంటే సృష్టించడంలో, పాలనలో, పోషణలో, అల్లాహ్‌తోపాటు ఇతరులను సహాయకులుగా సాటి కల్పించటం.

## 2." తౌహీదె ఉలూహియత్"

"ఆరాధనకు అర్హుడు కేవలం సృష్టికర్త అల్లాహ్ ఒక్కడే. ఆరాధనలను, మొక్కుబడులను స్వీకరించేవాడు ఆయనే. మన నమాజులు, ఉపవాసాలు, ఖుర్బానీలు, దుఆలు, సమస్త ఆరాధనలు, మన జీవన్మరణాలు ఆయనకే వర్తిస్తాయి" అని విశ్వసించటం.

ఆయన తన ఆరాధనలలో మధ్యవర్తిత్వం అక్కరలేనివాడు. విశ్వాసులకు–అవిశ్వాసులకు మధ్య తేడా ఏమిటంటే విశ్వాసులు కేవలం సృష్టికర్తైన అల్లాహ్‌ను మాత్రమే నమ్మి, ఆయన కొరకు ధన, ప్రాణ, శారీరక, సకల ఆరాధనలు చేస్తారు. అవిశ్వాసులు సృష్టికర్త ఒక్కడని నమ్మినప్పటికీ ధన, ప్రాణ, శారీరక సకల ఆరాధనల్లో అనేకులను భాగస్వాములుగా లేదా మధ్యవర్తులుగా చేస్తారు. ఇది "షిర్క్ ఫిల్ ఉలూహియత్" (ఆరాధనల్లో సాటి కల్పించటం)గా పరిగణించబడుతుంది.

## 3. తౌహీదె అస్మా వ సిఫాత్

అల్లాహ్ గుణగణాల్లో, నామాల్లో వేటినైతే అల్లాహ్ తనకోసం ప్రత్యేకించి ఎన్నుకున్నాడో (అవి పవిత్ర ఖుర్ఆన్, హదీసుల్లో వివరించబడినవి) అవి కేవలం అల్లాహ్ కొరకే అని విశ్వసించాలి.

"ఆయనను పోలినది ఏదీ లేదు, మరియు ఆయన సర్వం వినేవాడు, చూసేవాడు". *(అష్ షూరా : 11)*

"తౌహీదె–అస్మా–వ–సిఫాత్" లేకుండా "తౌహీదె- రుబూబియత్", "తౌహీదె- ఉలూహియత్" స్వీకరించబడవు. ఇతరుల్లో అల్లాహ్‌కు చెందిన గుణాలున్నాయని విశ్వసించడం "షిర్క్ ఫి అస్మా –వ–స్సిఫాత్" అవుతుంది.

1.ఈ మూడు కోణాల్లో దేనిని నిరాకరించి, అల్లాహ్‌తో పాటు ఇతరులకు సాటి కల్పించినా, అలాంటి వ్యక్తి ఈ పరిధి నుండి దూరమై అవిశ్వాసానికి పాల్పడినవాడవుతాడు. అలాంటి వ్యక్తి నరకాగ్నికి ఆహుతి అవుతాడు.

"అల్లాహ్‌కు భాగస్వాములు ఉన్నారని నమ్మకం కలిగి ఉండే వ్యక్తి మరణిస్తే అతడికి శాశ్వత నరకాగ్ని ప్రవేశం తప్పదు".

2. బహు దైవారాధన (షిర్క్) వలన పుణ్యకార్యాలు వృథా అవుతాయి. పవిత్ర ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

"ముష్రిక్కులు తాము స్వయంగా తమ అవిశ్వాసాన్ని గురించి సాక్ష్యమిస్తున్నప్పుడు వారు అల్లాహ్ మస్జిదుల నిర్వహణకు ఎంతమాత్రం తగరు. వారి కర్మలన్నీ వృథా అయిపోయాయి. శాశ్వతంగా వారు నరకాగ్నిలో ఉంటారు." *(అత్-తౌబా:17)*

## 'ముహమ్మదుర్- ర్రసూలుల్లాహ్' అంటే...

"ముహమ్మదుర్- ర్రసూలుల్లాహ్" కలిమాలో ప్రస్తావించబడిన వాక్యానికి రెండవ భాగం. ఇది 'రిసాలత్' కి (దైవ దౌత్యానికి) సంబంధించినది. అంటే ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ ప్రవక్త అని అర్థం. మనం రిసాలత్ వచనాన్ని విశ్వసిస్తున్నట్లైతే అందుకు ప్రతిగా మన జీవితంలో అడుగడుగునా మహా ప్రవక్త ముహమ్మద్ (స) ను ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగు జాడల్లోనే నడవాలి. ఆయన (స) ఏదైనా ఆజ్ఞ ఇస్తే ఆ ఆజ్ఞను శిరసావహించాలి, ఆయన (స) తెలిపే ప్రతి విషయం అల్లాహ్ ఆదేశానికి అనుగుణంగా ఉంటుంది. పవిత్ర ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు :

"ఆయన (స) తన మనోభిరామంగా ఏదీ మాట్లాడరు. అది ఆయన (స)పై అవతరించిన దివ్య జ్ఞానమే". *(అన్నజ్మ్ : 3, 4)*

మన సకల ఆరాధనలను కేవలం ప్రవక్త (స) చూపిన మార్గం లోనే పూర్తి చేయాలి. దానినే "సున్నత్" (ప్రవక్త సంప్రదాయం) అంటారు.

## 'సున్నత్' (ముహమ్మద్ (స) పద్ధతి)

'సున్నత్' అంటే ప్రవక్త (స) ఆచరణ, పద్ధతి. దాని పరిధిలో ప్రవక్త (స) పలుకులు, ఆచారాలు, నడవడికలు వస్తాయి. ప్రతి ముస్లిం తన ఆచరణలను ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్ (పద్ధతి) ప్రకారం ఆచరించాలని విధిగా నిర్ణయించ బడింది. దాని గురించి అల్లాహ్ పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఇలా సెలవిస్తున్నాడు :

"ప్రవక్త మీకు ఇచ్చిన వాటిని తీసుకోండి, ఆయన మీకు నిషేధించిన వాటికి దూరంగా ఉండండి. అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగి ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ శిక్షించడంలో చాలా కఠినుడు". *(అల్ హష్ర్ :7)*

అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు :

"ఎవరైతే నా పద్ధతిని వ్యతిరేకిస్తాడో, అంగీకరించడో అతనికి–నాకు మధ్య ఎటువంటి సంబంధం ఉండదు. ధర్మంలో లేని విషయాలను సృష్టించకూడదు. అటు వంటి ఆచరణలు స్వీకరించబడవు. వాటిని బిద్అత్ అంటారు. వాటిని సృష్టించే వారికి నరకమే శరణం అవుతుంది."

## 'బిద్అత్', దాని వివరణ

ఇస్లాం ధర్మంలో నవీన పోకడలను సృష్టించడాన్ని "బిద్అత్" అంటారు. పవిత్ర ఖుర్ఆన్, హదీసు ప్రకారం ఎలాంటి ఆధారాలు లేకుండా ఏదైనా కార్యాన్ని సృష్టించి పుణ్యంగా భావించి చేయడం – దీనినే "బిద్అత్" అంటారు. ఇలాంటి ఆచరణలకు ఇస్లాం ధర్మంతో ఎలాంటి సంబంధం లేదు. ఇలాంటి ఆచరణలు చేసేవారు మార్గ భ్రష్టులవుతారు. అగ్నికి ఆహుతులవుతారు. మహా ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు :

"ఇస్లాం ధర్మంలో ప్రతీ క్రొత్త పోకడ 'బిద్అత్' అవు తుంది. ప్రతీ 'బిద్అత్' మార్గ భ్రష్టత అవుతుంది. ప్రతీ మార్గభ్రష్టత నరకానికి దారి తీస్తుంది".

*(సహీహ్ ఇబ్నె ఖుజైమా :3/1785)*

"ఎవరైతే మా ఈ ధర్మంలో 'లేనిపోని ఆచారాలు' (బిద్అత్‌లు) సృష్టిస్తాడో అతను ధూత్కారి".

*(సహీహ్ బుఖారీ :2697)*

'బిద్అత్' వలన విశ్వాసి హీనమైన అపవాదాలకు గురవు తాడు. అల్లాహ్ సన్నిధి నుండి, పవిత్ర ఇస్లాం ధర్మం నుండి దూరమవుతాడు. 'బిద్అత్' వ్యక్తిని 'తౌబా' నుండి దూరం చేస్తుంది. అందుకే మనం వాటికి దూరంగా ఉండాలి. ప్రవక్త (స) మార్గంలో నడవాలి.

## ప్రవక్త (స) విశిష్టత, ప్రత్యేకతలు

అంతిమ ప్రవక్త (స)కు అనేక ప్రత్యేకతలు, వరాలు ప్రసాదించబడ్డాయి.

1. అల్లాహ్ ప్రవక్త (స) కు మునుపు ఎందరినో ప్రవక్తలుగా పంపించాడు, కానీ ప్రవక్త ముహమ్మద్ (స)ను సర్వమానవాళికి ప్రవక్తగా చేసాడు.

"ఓ ప్రవక్తా!(స) మీరు చెప్పండి: మానవులారా! నిశ్చయంగా నేను మీ అందరి వైపునకు అల్లాహ్ సందేశహరుడిని". *(అల్ ఆరాఫ్ : 158)*

కాబట్టి ఇహలోకంలో ప్రతీ మానవునికి ప్రవక్త (స) ను విశ్వసించడం తప్పనిసరి. ప్రవక్త (స) ఒక హదీసులో ఈ విధంగా ప్రస్తావించారు:

"ఎవరి అధీనంలో అయితే నా ప్రాణముందో ఆ దేవుని సాక్షిగా! ఏ వ్యక్తి అయినా (యూదుడైనా, క్రైస్తవుడైనా) నా గురించి ప్రస్తావన విని కూడా నన్ను విశ్వసించక పోతే అతడు నరకవాసి". *(ముస్లిం)*

2. ముహమ్మద్ (స) అంతిమ దైవ ప్రవక్త. ఆయన తరువాత ప్రళయం వరకు ఏ ప్రవక్తా రారు. ఆయనే ప్రవక్తల పరంపరను సమాప్తం చేసే చివరివారు.

## అంతిమ దైవ దౌత్యం పై విశ్వాసం

ప్రవక్త ముహమ్మద్ (స) అంతిమ ప్రవక్త. ఆయన తరువాత ఎవరూ ప్రవక్త కాజాలరు. ఒకవేళ ఎవ్వరైనా ప్రవక్తగా ప్రకటించుకుంటే అతను బూటకపు ప్రవక్త అనబడతాడు. ఎందుకంటే అల్లాహ్ పవిత్ర ఖుర్ఆన్‌లో ముహమ్మద్ (స) అంతిమ ప్రవక్త అని తెలియజేశాడు :

"ముహమ్మద్ (స) మీ మగవారిలో ఎవరికీ తండ్రి కారు. కాని ఆయన అల్లాహ్ సందేశహరుడు. ప్రవక్తల పరంపరను సమాప్తం చేసే చివరివారు". *(అహ్‌జాబ్ : 40)*

**"ఖాతమున్"** అంటే 'సీలు' అని అర్థం. 'సీలు' అనేది ఒక ప్రక్రియ పూర్తయిన తరువాత పడుతుంది. ముద్ర పడిన తరువాత ఆ పని అన్ని విధాలుగా పూర్తయినట్లే. అంటే ప్రవక్త ముహమ్మద్ (స) రాకతో దైవదౌత్య పరంపరకు సీలు పడిపోయింది. కనుక మన ప్రవక్త ముహమ్మద్ (స) తరువాత ఎవ్వరైనా తనను ప్రవక్తగా ప్రకటించుకుంటే అతను అసత్యవాది, మోసగాడు.

అల్లాహ్ మానవులందరికి 'కలిమా'ను అర్థం చేసుకుని మనసారా పఠించే భాగ్యాన్ని ప్రసాదించుగాక..! ఆమీన్!

మరిన్ని వివరాలకు సంప్రదించండి

MARKAZ DARULBIR

Ahmed Nagar, PEDANA - 521366

Krishna Dist. A.P. Ph : 08672 200003, 9912193013